క. నం. 7484

# ఎదురుచూపు

**అదృష్టం** అందరిసొత్తూ కాదు. అది లేనప్పుడు జీవితంలో అడుగడుక్కూ ఎదురు దెబ్బలు తగులుతాయి. సుభద్ర జీవితమే దీనికి నిదర్శనం.

* * *

అతను ముఖం నిండుగా మఫ్లర్ చుట్టుకున్నాడు. కాకీచొక్కావేసి దానిమీద నల్లటి పేంటు తొడిగాడు. కాళ్ళకు నల్లని రబ్బరు బూట్లు. అంతా నలుపే. కళ్ళుతప్ప మరేమీ కనిపించడంలేదు. ఎంత తెలిసినవారికయినా ఆ దుస్తుల్లో అతన్ని గుర్తించటం కష్టం.

గదిలో చిన్నదీపం గుడ్డిగా వెలుగుతూంది. పొగవోడిన చిమ్నీ మసికారుతూంది. సుభద్ర నులకమంచం మీద కూర్చుని కన్నార్పకుండా చూస్తూంది. రాత్రి గడిచేకొద్దీ ఆమెగుండె బరువెక్కుతూంది. ఆ బరువు అర్థమేమిటో, కారణమేమిటో తనకు తెలియదు. తను మౌనంగా కూర్చుంది తదేకంగా అతన్ని చూస్తూ.

అతను బట్టలువేసుకోడం ముగించాడు. ఒక్కసారి పగిలిన అద్దం ముక్కలో చూసుకొని తృప్తిగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పులోని బాధ ఈ ప్రపంచంలోకెల్లా తన ఒక్కదానికే తెలుసు. ఎందుకంటే ఇల్లాంటి మానసిక బాధే ప్రతిరోజు తనూ అనుభవిస్తూంది కనుక.

మూలనున్న పెట్టెతెరిచి ఏదో అందులోంచి తీసి జేబులో ఉంచుకున్నాడు. తర్వాత, దీపం తీసుకొచ్చి తన ముఖం దగ్గరగాపెట్టి ఏవో వెతుకుతున్నట్లు తన ముఖంలోకి, కళ్ళలోకి చూస్తూ నించున్నాడు. ప్రతిరాత్రి— అతను బయటకు వెళ్ళేముందు, ఓ నిమిషంపాటు అల్లా తన ముఖంలోకి చూసేవాడు. అల్లా అతను చూసేటప్పుడు తన హృదయారాటం తీరేలా అతన్ని కావలించుకొని ఏడవాలనిపిస్తూంది సుభద్రకు. కాని అతను బాధపడతాడేమోనని తన బాధను బయటికి రానీదు.

దీపం కింద ఉంచి, తలుపు తీసుకొని బయటికి వెళ్ళాడు రామచంద్ర. ఆతనిపేరు రామచంద్ర. తెరిచిన తలుపుగుండా ఒక్కసారి చలిగాలి రివ్వుమని గదిలోకి వీచింది. సుభద్ర గుమ్మంలోకి వచ్చి నిలబడ్డది, తలుపు వేసుకోవడానికి.

శీతకాలపు రాత్రి. ఒంటిగంట దాటింది. రివ్వున చలిగాలి కొడుతూంది. వీధి పొడుగునా నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉంది. దూరంగా ఎక్కడో ఓ కుక్క ఉండి ఉండి ఏడుస్తూంది హృదయవిదారకంగా. ఆ సమయంలో— ఆ కుక్క ఏడ్పు వింటే సుభద్ర శరీరమంతా గుగుర్పొడిచింది భయంతో.

అమావాస్య రాత్రిలా ఉంది. బయట కటిక



మానవ జీవితం సఫలం కావాలంటే ఒక అర్థం, పరమార్థం ఉండాలి. బ్రతుకే సమస్యగా పరిణమించినప్పుడు, సర్వశక్తులూ కేంద్రీకరించి కృషిచేసినా ప్రయోజనం లేనప్పుడు ఇతర విలువలకు ఆస్కారం ఉండదు. పెడదారి త్రొక్కడం సంభవం. తరువాత ఏమిటి? అన్న ప్రశ్న అనవసరం కూడా.

---

చీకటిగా ఉంది. గుమ్మందిగి ఓ నిమిషంపాటు అటూ ఇటూ చూసి అడుగులో అడుగేసుకుంటూ వెళ్లిపోయాడు రామచంద్ర. గుమ్మం పట్టుకొని చూస్తూ నిలబడ్డది సుభద్ర. అతన్ని వెనక్కి పిలిచి, అతని పాదాలు గట్టిగా పట్టుకొని, ఈ భయంకరమైన చీకటి రాత్రిలో బయటికి వెళ్ళనీకుండా నిలుపుకుంటే తనకింత మానసిక వేదన, ఆరాటం ఉండదు. కాని ఆ పని తను చేయలేదు. అశక్తతమాత్రం కాదు. తీరా ఆలోచిస్తే, ఆ పని చేయవలసిన అవసరం కూడా కనిపించదు. ఇల్లాంటి మూగవేదనతో, హృదయ శోకంతో తపిస్తూ, ఎన్నో రాత్రులు గడిపింది సుభద్ర.

చూస్తుండగానే అతని నల్లటి ఆకారం చీకటిలో కలిసిపోయింది.

తలుపుమూసి గడియపెట్టి, దీపం ఇంకా కొద్దిగాతగ్గించి, మళ్ళీ మంచంమీద కూర్చుంది సుభద్ర. తనకు ఇంక నిద్రపట్టదు. అతను తిరిగి వచ్చేంతవరకు గుమ్మంవేపు చూస్తూ కాపెట్టుకొని కూర్చోవడం తనకలవాటు. ఈ రోజు ఎందుకనో తన మనస్సు ఎక్కువగా బాధపడుతూంది. ఎందుకో ఈ రాత్రి తన మనస్సు ఏదో అపాయాన్ని శంకిస్తూంది. మన స్సుకు ఎంత ధైర్యం చెప్పుకున్నా, భయంకరపు ఆలోచనల ఆపడం కష్టంగా ఉంది. హృదయ భారం తీరేలా వెక్కివెక్కి ఏడవాలనిపిస్తుంది తనకు.

తెల్లవారుజామున ఏ అయిదింటికో ఆరుకో అతను తిరిగి వస్తాడు. అంతవరకు తను అట్లాగే కూర్చుంటుంది, అతని అడుగుల చప్పుడుకు చెవులు రిక్కించుకొనివింటూ. చాలా సార్లు అతను మందలించాడు కూడా, నిద్ర లేమితో అనవసరంగా సుభద్ర ఆరోగ్యం పాడు చేసుకుంటుందని.

కాని తన మానసిక వేదన, మళ్ళీ అతను కని పించేవరకు తన హృదయం పడే ఆరాటం ఎవరికి అర్థమవుతాయి? ప్రతి నిమిషమూ అపాయాన్ని శంకిస్తూ ఒంటరిగా ఆ గదిలో కూర్చుని తను పడే హృదయవేదనకంటే నరకం ఎంతోమేలు. ఆ పరిస్థితిలో తనకు నిద్దరెలా వస్తుంది?

పలకరించే దిక్కయినా లేక ఏకాకిగా ఆ గదిలో ఉన్న సుభద్రకు ఎన్నో ఆలోచనలు వస్తున్నాయి.

తనకు పెళ్లయి మూడేళ్లయింది. పెళ్లయ్యే నాటికి అతను ఏదో ఆఫీసులో గుమాస్తాగా పని చేసేవాడు. తను అతి సామాన్య కుటుంబానికి చెందింది. పేదతనంలో పుట్టిపెరిగిన తనకు చదువుకొన్నవాడు, నెలకు వంద రూపాయలు సంపాదించగల భర్త దొరికేసరికి తనంత అదృష్టవంతరాలు మరొకరు లేరని మురిసి పోయింది సుభద్ర. అల్లాగే ఉన్న ఉద్యోగం తప్ప ఏ ఆస్తిపాస్తులూ లేని తనకు సుభద్రలాంటి అందగత్తె భార్యగా దొరకడం తన అదృష్టమని మురిసిపోయాడు రామచంద్ర.

తన భర్త చాల మంచివాడు. అతని మనస్సు ఎంతో సున్నితమయింది. తనను ఎంతగానో ప్రేమించేవాడు. తనకు ఆనందం కలిగించే ఏ పని చేయాలన్నా అతని కానందం. తమ దాంపత్య జీవితం ఇల్లా సుఖవంతంగా రెండేళ్ళపాటు గడిచిపోయింది.

ఆఫీసునుంచి ఎప్పుడూ హుషారుగా, ఉత్సాహంగా వచ్చే భర్త ఓ రోజు దిగాలుగా ముఖం వ్రాల్చుకొని ఇంటికి వచ్చాడు. ఆ రాత్రి భోజనం సమయంలో చెప్పాడు తన ఉద్యోగం పోయిందని. కారణమేమిటో చెప్పలేదు. తను అడగనూ లేదు.

తమ ఇద్దరిలో ఎవరికీ ఎల్లాంటి ఆస్తి పాస్తులూ లేవు. ఆదరించే ఆప్తులు అంతకంటే లేరు. జీవనాధారం, బ్రతుకుతెరువు అంతా ఆ ఒక్క ఉద్యోగమే! అది కాస్తాపోయింది. ఈ ఏడాదిగా తాము పడ్డ అగచాట్లు ఆ భగవంతుడికే తెలియాలి.

మరో ఉద్యోగం సంపాదించడంకోసం అతను చేసిన ఈ ఆరునెలల ప్రయత్నం వ్యర్థమయింది. పత్రికల్లో కనబడిన ప్రతి ప్రకటనకు దరఖాస్తులు పెట్టాడు. కాళ్లు అరిగేలా ప్రతి ఆఫీసు చుట్టూ తిరిగాడు. రికమెండేషన్ కోసం పలుకుబడిగల ఆసాముల ఇంటిముందు కుక్కలా పడిగాపులు కాశాడు. కాని, లాభం లేక పోయింది. తను విసిగిపోయాడు. జీవితంపై విరక్తి కలిగింది. ఎన్నో రాత్రులు తామిద్దరూ కేవలం మంచినీళ్ళుత్రాగి ఉపవాసాలు ఉన్నారు. ఇల్లాంటి నికృష్ట జీవనం గడిపేకంటే ఇద్దరూ ఆత్మహత్య ఒక్కసారి చేసుకోవడం మంచిదని పించేది. ఒకరినొకరు కావలించుకొని పసిపిల్లల్లా ఏడుస్తూ, ఒకరికొకరు ఓదార్పు మాటలు చెప్పుకొనేవాళ్ళు. తమను ప్రేమించి, తమ కోసం జీవించే మరో వ్యక్తి ఉన్నదనే భావం లేకుంటే ఎప్పుడో ఆత్మహత్య చేసుకునే వారు.

చివరికి నిరాశతో, విరక్తితో అసలు ఉద్యోగ ప్రయత్నమే మానుకున్నాడు రామచంద్ర.

ఇలా కొన్నాళ్ళు గడిచింది.

ఓ దినం అర్థరాత్రి ఎవరో వచ్చి తన భర్తను పేరు పెట్టి పిలిచాడు, మెల్లిగా తలుపుమీద చప్పుడు చేస్తూ. తను మేలుకునే పడుకుంది. కాని పలకలేదు. తన భర్త మెల్లగా చప్పుడు చేయకుండా తలుపుతీసి బయటికి వెళ్ళాడు. ఆ వచ్చిన వ్యక్తితో ఏవో గుసగుసలు మాట్లాడాడు. మళ్ళీ ఇంట్లోకి వచ్చి బట్టలు మార్చుకొని, పెట్టెలోంచి ఏదోతీసి జేబులో ఉంచుకొని, ముఖం నిండుగా మఫ్లర్ చుట్టు కొని, ఆ వచ్చిన వ్యక్తితోబాటు చీకట్లోకి వెళ్లి పోయాడు.

సుభద్రకు అంతా అయోమయమనిపించింది. వాళ్ళు మాట్లాడుకున్నదేమిటో, చేసేదేమిటో ఏమీ అర్థం కాలేదు. కేవలం ఆశ్చర్యమూ, భయమూ తనలో మిగిలిపోయాయి. ఆ వచ్చిన కొత్తమనిషిని చీకట్లో తను చూడలేక పోయినా ఎందుకో అతనంటే పరమ అసహ్యం మనిపించింది. అతని వ్యవహారం చూస్తుంటే ఎంత కొత్తవారికయినా అనుమానం తగులుతుంది. ఇల్లాంటి నీచ ప్రవృత్తిగలవారితో తన భర్త ఎందుకు స్నేహం చేయవలసిన అవసరం పడిందో అర్థం కాదు.

ఆ రాత్రి తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు రామచంద్ర రొప్పుతూ, రోజుతూ. అతని ఒళ్లంతా చెమట్లు కక్కుతూంది. అంతవరకు ఎక్కడికిపోయింది, ఏం చేసింది తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగాఉంది సుభద్రకు. కాని నోరు విప్పి తను అడగలేదు. అతను చెప్పనూ లేదు.

ఆ మరునాటి ఉదయం పది గంటల వరకూ గుర్రుపెట్టి నిద్రపోయాడు రామచంద్ర, అంతకు ముందు ఎన్నో రాత్రులు నిద్రలేని వాడికి మల్లే. ఆ మధ్యాహ్నం బజారుకు వెళ్ళి సుభద్రకు ఇరవై రూపాయలు పెట్టి ఓ మంచి చీర తెచ్చి ఇచ్చాడు. తను ఓ జత కొత్త బట్టలు కుట్టించుకున్నాడు. ఓ వారానికి అయ్యే ట్లుగా ఇంట్లోకి బత్తెం తీసుకొచ్చాడు.

సుభద్రకు అంతా ఆశ్చర్యంగా, అగమ్య గోచరంగా ఉంది. అంతకు ముందు రోజువరకు ఇంట్లో ఓ చిల్లిగవ్వయినాలేదు. అల్లాంటిది ఇంతలోగా ఇంత డబ్బెక్కడనుండి వచ్చింది? గత రాత్రి తన భర్త ప్రవర్తన ఎంతో వింతగా, అనుమానాస్పదంగా ఉంది.

ఆ దినం నుండి అప్పుడప్పుడు రాత్రిపూట బయటికి వెళ్ళుతుండేవాడు తన భర్త. ఎప్పుడు వెళ్ళినా, అర్ధరాత్రి దాటిన తర్వాత వెళ్ళేవాడు. మళ్ళీ తెల్లవారుజామున ఏ అయిదింటికో తిరిగి వచ్చేవాడు. తొలుత కొద్దిరోజుల వరకు మొట్టమొదట వచ్చిన ఆవ్యక్తితోబాటు కలిసి

---

**వాస్కోటి జానకిరాం**



ఈ నల్లని రాతిలో
ఏ గుండెలు దాగెనో?

ఫోటో—ఎస్. ఆర్. డి. మూర్తి (మద్రాసు-4)

# ఎదురుచూపు

పోతూండేవాడు. తర్వాత కొన్నాళ్ళు ఎవరెవరో కొత్త వారితోబాటు కలిసిపోయేవాడు. కాని ఈ మధ్య తనే ఒంటరిగా పోవడం మొదలెట్టాడు.

రాత్రిపూట బయటికి వెళ్లితే ఆ మరునాటి పగలంతా ఒక్క మోపుగా నిద్రపోయేవాడు. ఒక్కోరోజు ఎవరో కొత్త కొత్త వ్యక్తులు తన భర్తకోసం వచ్చేవారు పగటిపూటకూడా. తలుపులు మూసుకొని ఏవో రహస్యాలు మాట్లాడే వారు. ఒక్కోసారి డబ్బులుకూడా పంచుకునే వారు. ఆ వచ్చిన వ్యక్తుల్ని చూస్తే సుభద్రకు పరమ అసహ్యం. వారి జీవితాలు అనుమానాస్పదము, అవినీతితో నిండినవి అయి ఉంటాయని తనకు తెలుసు. ఇల్లాంటి అలగాజనంతో తన భర్తకున్న సంబంధం ఏమిటో బొత్తిగా అర్థంకాదు సుభద్రకు.

దాదాపు ఆరుమాసాలనుండ తమ కూటికి, గుడ్డకు లోటులేకుండా జరుగుతూంది. రామచంద్ర ఉద్యోగంలో ఉన్న రోజుల్లో కంటే ఇప్పటి పరిస్థితే అన్నివిధాల మెరుగ్గా ఉంది. కాని ఇంత డబ్బు ఎక్కడనుండి వస్తున్నది సుభద్ర ఆలోచనకు అందని విషయం. రాత్రులు తన భర్త ఎక్కడికి పోతున్నది, ఏం చేస్తున్నది కొంచెమయినా అంతు దొరక్కుండా ఉంది. సుభద్ర మనస్సు పరిపరి విధాల పోయింది. రాత్రులు ఎక్కడయినా పోయి తన భర్త జూద మాడుతున్నాడేమోనని అనుమానం తగిలింది సుభద్రకు. కాని జూదమయితే ప్రతిసారి గెలుస్తాడనే నమ్మకం ఏది? కుతూహలం అణుచుకోలేక అప్పటికి ఒకటి రెండు సార్లు తన భర్తను అడిగింది. అతను నవ్వి ఏదో సమాధానం చెప్పాడు. ఆ సమాధానంతో తనకు తృప్తి కలగలేదు. అయినా మళ్ళీ ఆ ప్రస్తావన ఎత్తలేదు సుభద్ర.

ఒక రోజు మధ్యాహ్నం తన భర్త ఆదమరచి నిద్రపోతున్నాడు. వేసవికాలం మధ్యాహ్నం. తెరిచిన కిటికీగుండా పక్క వేప చెట్టులోంచి చల్లగాలి వీస్తూంది. ఆ ముందురోజు రాత్రి పెందలకడపోయి, బాగా తెల్లవారేముందు వచ్చాడు రామచంద్ర. అందుకనే స్పృహలేకుండా కొయ్యలా పడి నిద్రపోతున్నాడు. పూలావిడ బాకీడబ్బులకని వచ్చింది. సుభద్ర లేపి చూసింది. అతను లేచే స్థితిలో లేడు. అందుకని, తనే గోడకు తగిలించిన షర్టు జేబులో చిల్లర డబ్బులకోసం చెయ్యిపెట్టి వెతికింది. జేబులో ఏదో గట్టిగా తగిలింది. బయటికి తీస్తే తన కళ్ళు జిగేలుమన్నాయి. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. అదొక రాళ్ళ నెక్లేస్. ఓ పక్కన తెగిన చోట కత్తిరించిన గుర్తు ఉంది. జేబులో ఇంకా తడిమితే ఓ కత్తెర, బ్లేడు, బీగం చేతుల గుత్తి, సగం కాలిన క్రొవ్వువత్తి దొరికాయి. సుభద్రకాళ్ళకింద భూమి జరిగి పోతున్నట్లు అనిపించింది.

అప్పుడు అర్థమయింది తన భర్త యింత కాలంగా చేస్తున్నపని. జరిగినదంతా తన కళ్ళకు స్పష్టంగా కనిపించసాగింది. పోలీసులు, సంకెళ్ళు, జైళ్ళు, కోర్టులు అన్నీ తన కళ్ళకు ఎదుట ఓ సారి గిర్రున తిరిగిపోయాయి. చెప్పరాని భయంతో తన కాళ్ళు వణకడం మొదలు పెట్టింది. అతనికి ఈ భయాలేమీ లేనట్లుంది. హాయిగా ఆదమరిచి నిద్రపోతున్నాడు.

తను వెళ్లి అతని పక్కనే కూలబడింది. నిద్రపోతున్న అతని ముఖం వంక చూస్తూ అల్లాగే కూర్చుంది. ఎండ వేడిమికి అతని ముఖంనిండా చిరుచెమట్లు పోస్తూంది. పసిపిల్లవాని ముఖంలా ఎంతో అమాయకంగా కనిపించే అతని ముఖం చూస్తే యింత నీచమయిన పనికి తలబడతాడని అనిపించదు. అతను చేస్తున్న పని ఎంత నీచమయినదయినప్పటికీ, అతనంటే తనకు అసహ్యంగాని, కోపంగాని కలుగలేదు. పైగా ఆ సమయంలో అతని పై మరింత ప్రేమ, జాలి కలిగాయి. ఎందుచేతో, తనకు తెలియకనే సుభద్ర కళ్ళనుండి బొట్లు బొట్లుగా నీళ్ళు కారసాగింది.

ఇక ఆ దినం నుండి తన భర్త బయటికి వెళ్ళినరాత్రి తను నరకయాతన పడేది. అతను క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు తనకు మనశ్శాంతి ఉండేదికాదు. అతను గడిపే ఈ భయంకర జీవితం తలుచుకుంటే తన గుండెలు జలదరిస్తుంది. అతను గడపదాటినది మొదలు, తిరిగి వచ్చేంత వరకు గుమ్మంవైపు చూస్తూ కాపెట్టుకొని కూర్చునేది సుభద్ర. అడుగుల చప్పుడయినప్పుడల్లా ఏదో ఆపదలో తన భర్త పరుగెత్తుకొస్తున్నాడని ఉలికిపడి తలుపు తీసేది. ఎవరూ లేకపోవడం చూసి, అంతా తన భ్రమ అనుకునేది. గుండెల్ని గుప్పెట్లో పెట్టుకొని, శంకిత హృదయంతో క్షణమొక యుగంగా గడుపుతూ రాత్రంతా మేలుకొని కూర్చునేది. తన భర్త క్షేమంగా తిరిగి రావాలని వేయి దేవుళ్లను వేడుకొనేది.

తన భర్త చేస్తున్నపని ఎంత నీచమయిందో తనకు బాగా తెలుసు. అయినా తన భర్తపైని గౌరవాభిమానాలు యిసుమంతయినా తగ్గలేదు. అతని తప్పేమీ లేదని తనకు తెలుసు. అంతా తమ పరిస్థితి ప్రభావంకాని మరొకటి కాదు.

ఆస్తిపాస్తులు లేని వారికి ఉద్యోగమే జీవనాధారం. అది కూడా లేకపోతే పొట్టకోసం ఆడదయితే వ్యభిచారం, మగవాడికి దొంగతనం తప్పవు.

తనచేత వ్యభిచారం చేయించి అతను పొట్ట పోసుకోలేదు కనుక, అతను దొంగతనంచేసి తనను

(తరువాయి 58 వ పేజీలో)

## గ మ ని క

మామూలుగా ప్రచురణకు రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, మద్రాసు'కు పంపవలసి ఉన్నది. పోటీలకు అయితే కవరుమీద పోటీ పేరు స్పష్టంగా వ్రాయాలి.

రేఖా చిత్రాలు, డిజైనులు ఇండియన్ ఇంక్‌తో వేసినవి మాత్రమే ప్రచురణకు పరిశీలించడం జరుగుతుంది. వాటిని మడిచి కవరులో పంపవచ్చు.

తగుమాత్రం పోస్టేజి పంపిన వారికి మాత్రమే ప్రచురణకు అంగీకరించని రచనలు మున్నగునవి త్రిప్పిపంపడం జరుగుతుంది.

ఎడిటర్

ఉచితము:— ఉగాది బహుమతి:—
శ్రీ బమ్మెర పోతనామాత్య ప్రణీత
**శ్రీమహాభాగవతము**
(పద్యకావ్యము)
టీకతో చక్కని 25 బొమ్మలు చేర్చి ప్రకటించితిమి పూర్తి క్యాలికో బైండు. వెల రు. 19—00 లు కొన్నవారికి బహుమతి పుస్తకము శ్రీ భగవద్గీత శ్లోకం తాత్పర్యం 18 అధ్యాయములు గలది. ఉగాదివరకే ఇవ్వబడును. పోస్టేజి ప్రత్యేకం.
బాలసరస్వతీ బుక్ డిపో,
H.O. కర్నూలు. బ్రాంచి : మద్రాసు-1
SWASTIK

## మన తెలుగుతల్లి

( 5 వ పేజీ తరువాయి)

మతులు పొందుతారు.

స్వామివారి గాలిగోపుర కలశాలుగాని, విమాన కలశంగాని బంగారుమయం కావడం మరొక ప్రత్యేకత. శ్రీవారు పడమర దిశగా వీక్షిస్తుంటారు. అంటే పినాకినీ నదీమతల్లిని చల్లని చూపులతో ఆశీర్వదిస్తుంటారు. అందుకు కృతజ్ఞతకే గాబోలు నదీమతల్లి పెద్దగా వరద వచ్చినపుడు వారి పాదాలు తాకి పవిత్రురాలై తరలి పోతూంటుంది.

ఈ ఆలయం తర్వాత ముఖ్యమైనవి మూలపేట వేణుగోపాలస్వామి వారి ఆలయం, దాని వెనుకనే ధర్మరాజ దేవస్థానం. ఈ ధర్మరాజ దేవస్థానం తిరుణాల చాల విచిత్రంగా ఉంటుంది. మొదట పచ్చి కడవను తయారుచెయ్యాలి. దానిలోనే నీరుతెచ్చి (పెన్నానదివి) ఆకడవపైన ఓకత్తి గుచ్చి, కత్తి చివరట నిమ్మకాయ గుచ్చాలి. అది తిరుణాల ప్రారంభించగలందులకు గల నిదర్శనమట. తర్వాత గుండంరోజు పెద్ద నిప్పుల గుండం తయారుచేసి దాని కెదురుగా ద్రౌపదీ దేవిని సర్వాలంకారభూషితురాలినిజేసి, పలుచని వస్త్రపు పావడ (నైలాను గుడ్డవంటిది) ధరింపజేసి, ఆసీనురాలిని జేస్తారు. అప్పుడామె భక్తులు (ఉపవాస దీక్షతో నియమింపబడినవారు) దోసిలితో నిప్పులందుకొని, అమ్మవారి పావడలో పోసి, మూట గట్టుతారు. అవి మినమిన మెరుస్తూ వెలుపలికి కనిపిస్తూంటాయేగాని గుడ్డ ఏమాత్రమూ కాలదట. ఈ నిదర్శనం ద్రౌపదీదేవి శక్తిని నిరూపించడమట.

ఈ తిరుణాల పదునెనిమిది రోజులు జరుగుతుంది. నిత్యమూ రోజుకొక పర్వం చొప్పున ప్రత్యక్ష భారతం జరుగుతుంది. ఈ ఉత్సవాలు భయంకరమైనవి, ప్రమాదకరమైనవి గనుక ఏటేట జరుపబడవు.

ఈవిధంగా నాటి సంస్కృతులను, నేటి నవీన సంస్కృతులును మేళవించి, అనేక సౌకర్యాలతో విరాజిల్లు పట్టణం. నాటి సింహపురి— నేటి నెల్లూరు. ★

## ఎదురుచూపు

( 8 వ పేజీ తరువాయి)

పోషిస్తున్నాడు.

ఈ రోజు ఎందుకో తన మనస్సు ఏమీ బాగ లేదు. మాటి మాటికి ఏదో కలవరపాటు చెందుతూంది. హృదయం అపశ్రుతులు పలుకుతూంది. ఈ మధ్య ఒక దినం తమ వీధిలో జరిగిన ఓ దృశ్యం చూసింది. ఈ దినం ఎందుకో మాటిమాటికి ఆ దృశ్యం తన కళ్ల ఎదుట కనిపిస్తూంది.

దాదాపు రెండు వారాలకు ముందు—

ఆ రోజు శనివారం. మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. తన భర్త యింట్లోలేడు. ఎక్కడికో బయటికి వెళ్ళాడు. తను కిటికీ ముందు కూర్చుని ఏదో అల్లుకుంటూ ఉంది. వీధిలో ఏదో అలజడయితే తను వాకిట్లోకి వెళ్ళింది. ఎవరో ఓ యువకుడు—సరిగ్గా తన భర్త వయస్సే ఉంటుంది. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. మంచి బట్టలు వేసుకున్నాడు. అతనిచుట్టూ మూగిన జనం తలా ఒక దెబ్బ వేస్తున్నారు. కొందరు చెప్పులు, రాళ్ళు విసురుతున్నారు. నోటికి వచ్చినట్లు నానాతిట్లూ తిడుతున్నారు. అతనేమీ అడ్డుపెట్టడం లేదు. మాటయినా మాట్లాడలేదు. మౌనంగా దెబ్బలకు శరీరం వప్పగించి నిలబడ్డాడు. చూస్తుండగానే అతని బట్టలు చీలికలు పేలికలయ్యాయి. గాయాలతో ముఖము, బట్టలు రక్తపు ముద్దలా అయ్యాయి. అంతలో ఎవరో పోలీసుల్ని పిలుచుకువచ్చారు. బీటు జవాన్లు అతని చేతులకు సంకెళ్ళు తగిలించి, దారిపొడుగునా బాదుకొంటూ తీసికెళ్ళారు. తిరణాలకు మల్లే అతనిచుట్టూ చేరినజనం, వేడుక చూస్తూ పోలీసుల వెంట పోయారు.


ఆ దృశ్యం తనను కదలించి వేసింది.

కనుమరుగయ్యేంతవరకు అతన్ని చూస్తూ గుమ్మంలో నించుంది. అతనెవరో తనకు తెలియదు. కాని అతనికి అంతమందిలో జరిగిన అవమానానికి తన కళ్ళవెంట నీరు కారసాగింది. అంతమంది అసహ్యించుకొన్న అతనిపై తనకు జాలిగా ఉంది. ఎవరి జేబులోనుండో పర్సు కొట్టేస్తుంటే పట్టుపడ్డాడని అంతమంది అతన్ని అంత నిర్దాక్షిణ్యంగా కొట్టారు. కాని ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లో అతను ఈ పనికి పాల్పడి ఉంటాడో ఆలోచించే శక్తయినా ఒకడికీ లేదు అంతమందిలో. అతని పరిస్థితిలోనే ఉన్నట్లయితే ఈ వేడుక చూసిన పెద్ద మనుషులు కూడా ఇంతకంటే నీచానికి ఒడిగట్టి ఉండేవారు.

సుభద్ర అల్లాగే స్థాణువులా గుమ్మంలో నిలబడిపోయింది. ఆ దెబ్బలు తిన్న వ్యక్తిస్థానే తన భర్త ఉన్నట్లు అనిపించింది. ఎంత ప్రయ

జర్మెక్స్
చర్మ వ్యాధులకు


ఎగ్జిమా, ఏనుగు దురద, తామర, మొటిమలు, ఉడుకు బొబ్బలు, పుండ్లు నివారించగలదు.
తయారుచేయువారు:
అటిల్స్ ఓరియంటల్ బామ్ & ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్, మద్రాసు.



నేనూ, నా బండీ — యుగయుగాల అనుబంధం మాది

ఫోటో—ఎస్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

త్నించినా తన కళ్ళల్లో నీరు ఆగడం లేదు. దుఃఖం పెల్లుబక సాగింది. పోలీసులు పట్టుకుపోయిన ఆ వ్యక్తికోసం ఇంటిదగ్గర అతని భార్య తనలాగే భర్త రాకకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అతనికి జరిగిన ఈ అవమానం ఆమెకేం తెలుసు? పాపం!

ఆ దినం తన భర్త ఇంటికి వస్తూనే, అతని గుండెలకు తల ఆనించి వెక్కివెక్కి ఏడ్చింది సుభద్ర, తన హృదయ భారం తీరేలా. కాని ఆమె దుఃఖానికి కారణమేమిటో అతనికి అర్థం కాలేదు.

• • •

తన ఆలోచనలతో ఎప్పుడు తెల్లవారిందో కూడా సుభద్ర గమనించలేదు. తెరిచిన కిటికీ గుండా ఇంట్లో పడిన వెలుగుచూసి ఉలిక్కిపడి లేచింది. గడియారం చూస్తే ఆరు కావస్తూంది. తూర్పుదిశన ఆకాశం రక్తంలాంటి అరుణ కిరణాలు వెదజల్లుతూంది.

సుభద్ర గుండెలు ఆత్రుతగా కొట్టుకోవడం మొదలెట్టింది. ఆమె మనస్సు నిండా ఎన్నో భయాలు, అనుమానాలు చోటు చేసుకొంటున్నాయి. ఈపాటికి ఎప్పుడో తన భర్త ఇంటికి రావలసింది. మామూలుగా అయితే ఐదు గంటలు కాకముందే వచ్చేవాడు. ఈ దినం ఇంత పొద్దెక్కినా ఇంకా రాలేదు. తన ధైర్యం దిగజారిపోతూంది. మనస్సు ఏదో అపశ్రుతి పలుకుతూంది. ఎన్నో సంశయాలు. వాటికి సమాధానం లేదు. మాటిమాటికి ఆ దినం మధ్యాహ్నం తను వీధిలో చూసిన దృశ్యమే జ్ఞాపకం వస్తూంది.

గుమ్మంలో నిలబడి వీధిపొడుగునా ఎక్కడైనా తన భర్త ఆకారం కనిపిస్తుందేమోనని ఆత్రుతగా చూస్తూ నిలుచుంది. అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

శీతాకాలపు ఉదయం. ఇంకా ఎండ పడలేదు. కొద్దిగా చలిగాలి కొడుతూనే ఉంది. ఊరు ఇంకా నిద్ర మగతలో నుండి సరిగా లేచినట్లు లేదు. వీధి నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉంది.

దూరంగా సందు మలుపు దగ్గర పాకీవాడు అప్పటికే వీధి ఊడుస్తున్నాడు. అక్కడ దుమ్ము రేగి, తడిగాలిలో కలిసి పలుచని తెరలా ఏర్పడింది. దూరంగా ఉన్న ఆ సందు మలుపునుండి పోలీసుల ఎర్రబుట్టలు, లాఠీలు, వారిమధ్య చేతులు వెనక్కు కట్టుకొని తలవాల్చుకొని పోతున్న ఓ నల్లటి ఆకారం అస్పష్టంగా కనిపించాయి— ఒక్కక్షణం మాత్రం, నీళ్ళు క్రమ్మిన సుభద్ర కళ్ళకు.

ఆమె తల తిరిగిపోతూంది. కాళ్ళు తేలిపోతున్నాయి. ఒక అడుగు వీధిలోకి దిగింది, పోలీసుల మధ్య పోతున్న ఆ వ్యక్తిని స్పష్టంగా చూడాలని. పాకీవాడు రేపిన దుమ్ము, ఆమె కళ్ళలో నిండిన కన్నీటికి తోడయి ఆ దృశ్యాన్ని మరీ అస్పష్టం చేసింది. దుమ్ము తగ్గేలోగా వాళ్ళు మలుపు తిరిగి వెళ్ళిపోయారు.

సుభద్ర గుమ్మంలో నిలబడి ఇంకా అతని కోసం ఎదురుచూస్తూనే ఉంది. ★